# కలహం

శ్రీ చోడవరపు రామశేషయ్యగారు

ఉదయం పదిఘంటలయింది. బారిష్టరు శివరావుగారి బేబీకారు తన సూక్ష్మకాయాన్ని దొర్లించుకుంటూ యింటి ఆవరణలోకి వచ్చింది. కారుకై కనిపెట్టుకునివున్న శివరావు వెంటనే బయటకువచ్చి పెట్రోలుందా అని డ్రైవర్ని అడిగాడు. ఉందని డ్రైవరుచ్చరించడంతోనే 'హాట్' కై యింట్లోకి పోయాడు. పార్వతితో చెప్పందే ఆఫీసుకు పోయే అలవాటులేదు శివరావుకు. పార్వతి ఎందుచేతోగాని యీదినం యింకా ఇంట్లోనే ఉండిపోయింది. శివరావు పార్వతీ! అని పిలిచాడు. పిలిచీ పిలువకముందే 'ఆఁ! వస్తున్నా'అని అంటూ గబగబ మూతితుడుచుకుంటూ వచ్చింది. ఆమె తుడుచుకుంటూవున్న మూతివంక చూస్తూ 'ఇంకా భోజనం కాలేదూ'అన్నాడు ఆశ్చర్యపోతూ శివరావు.

'అయింది; కాకపోవటం ఏమిటీ'అందికొంచెం త్వరపాటుతో.

'అయితే యింకా మూతికడుక్కోలేదూ !'

'కడుక్కునే వచ్చాను'.

'పల్లెటూరివాళ్లు ఇట్లాగేకడుకుంటూరు కామోసు!'

'ఏం పల్లెటూరివాళ్లకు మూతి కడుక్కోవడం కూడా చేతగాదా ఏమిటి?'—అని కొంచెం దురుసుగానే అంది పార్వతి.

'చూచుకోరాదూ అద్దంలో నామాట అబద్ధం అయితే' అన్నాడు శివరావు హేళనంగా.

'ఎందుకూ చూచుకోటం'? అంటూ కుర్చీమీద పడివున్న తుండుతీసికొని మూతి తుడుచుకుంది పార్వతి. మూతిని అంటుకునివున్న రెండు మెతుకులూ దానికంటుకున్నాయి. వానినిచూచి కొంచె చిన్నపుచ్చుకున్నప్పటికీ 'ఎక్కడా ఎంగిలి. ఏమీ పనిలేకపోతే సరే ఏదోవంకపెట్టి పల్లెటూరి వాళ్లకేమీ తెలీదని ఋజువుచేయడానికి ప్రయత్నిస్తారు' అని అంది బింకంగా.

'ఓ ప్రక్కన చూచుకుంటూకూడా అబద్ధం ఆడుతావెందుకు?' అన్నాడు శివరావు.

'నేనేమి అబద్ధం ఆడతే' అనికొంచెం కోపంగానే అంది పార్వతి.

'ఆడవాళ్లకు అబద్దాలాడటం అలవాటేమో! నాకేం తెలుసు. అబద్ధంకూడా నిజమే అవుతుందని నీదృష్టిలో. భయపడి తొలగిపోతూవున్న ఆడపులిని బాణంవదలి రెచ్చగొట్టినట్టయింది. శివరావన్నమాట శూలంవలేవెళ్లి పొడుచుకుంది పార్వతి హృదయంలో. క్రోధాగ్ని క్రక్కుతూవున్న కండ్లతో చురచుర చూచింది శివరావువైపు. శివరావు వ్యవహారం ముదిరిందని కాలుకాలిన పిల్లివలె నెమ్మదిగా పోయి కారులో కూర్చున్నాడు.

కారువెళ్లేవరకు పార్వతి అక్కడే నిలబడివుంది. అది వెళ్లడంతోటే పండ్లు పటపట కొరుకుతూ తన గదిలోకిపోయి తలుపువేసికొని మంచంమీద పడింది. ఆమె హృదయంలో అర్థంలేని తుపాను ఝుంకారాలుచేస్తూ బయలుదేరింది. పల్లెటూరివాళ్లకేమీ తెలీదు. వాళ్లెందుకూ కొఱగానివారా! అడవి మృగాలా! మానావమానాలు లేవువాళ్లకి! మూతిని ఎంగిలివుంటే ఎద్దేవచేయాలా? అందులో నౌకర్ల ముందు పట్టుకుని! మూతి కడుక్కోమని ముద్దుగా చెప్పకూడదు? పల్లెటూరివాళ్లంటే ఇంత తేలిక! వీరెక్కడ పుట్టారు! ఎక్కడ పెరిగారు!! ఇంగ్లండు వెళ్లి బారిష్టరుపరీక్ష పాసై వచ్చినంతనే దొరలయిపోయారు! మేమె! పల్లెటూరి గబ్బిలాయిలుగానే ఉండిపోయాము! అయితే ఇంత చదువుకుని వీరు చేసిన మహోపకారం ఏమిటి? మాబోటి మూర్ఖులకు

విద్యాబుద్ధులు గఱపకూడదమూ! పరాయిచేత నావల్ల పొరబాటుకలిగింది. అయితేమాత్రం విద్యావంతులయిన వీరు నన్ను ఎగతాళిచేస్తారు! అనుభవశూన్యనయినప్పటికి అభిమానం అనేదిలేదూ! వారు నన్నెంతో ప్రేమిస్తున్నారనుకున్నా. అది నిష్కపట ప్రేమే అయితే యీ వెక్కిరింతలెందుకు? ఈవేళాకోలాలెందుకు? అందులో నాకర్థమెరుకటూ! పల్లెటూరివాళ్ళనకపోతే వారికింకేమాట ఏమి తోచలేదు కాబోలు. పల్లెటూరి మహత్వం వీరికేం తెలుస్తుంది. అదే లేకపోతే వీరీ విధంగా యీ పట్టణాల్లో ఆడేవారే కామోసు. పల్లెటూరులోపుట్టిన వీరికి పల్లెటూరంటే ఇంత ఏహ్యమెందుకో! ఏమో! మగవారిని అర్థంచేసికోవడం చాలాకష్టం.

ఎంతవమానం జరిగింది! మూర్ఖురాలనై పోయానే! అబద్ధాలకోరునయి పోయానే!! ఇంకాయెట్లా తలెత్తుకుని తిరిగేది? నౌకరులు చెప్పుకోరూ, మన అమ్మగారికి మూతి కడుక్కోవటంకూడా తెలీదు అని. ఇంక వారి (పెనిమిటి)తో యెట్లా మాట్లాడేది? నా ముఖంవారికి యెట్లా చూపించేది? ఈగదిలోనె ఉండిపోతా, వారువచ్చినా బయటకుపోను. పిలిస్తే నే పెడుతా.

వారెన్నిసార్లు రోజూ కట్టుకునే 'టై' తప్పుకట్టుకున్నారో! అదిచూచినేను వారినేమైనా అన్నానా. మాట్లాడకుండాపోయి చక్కగా సరిచేయులేదూ! ఈ స్వల్పభాగ్యానికి నన్నింత హేళనచేయాలి!

* * * * *

రాత్రి యెనిమిది ఘంటలయింది. శివరావు మామూలుగా వచ్చేవేళకే యింటికి వచ్చాడు. గుమ్మంలో అడుగు పెట్టేసరికి, ప్రతిదినం తనరాకకై నిరీక్షిస్తూ వుండే పార్వతి కనుపించక పోయేసరికి నాటి ఉదయం జరిగిన ఘటనంతా జ్ఞాపకం వచ్చింది. ముసిముసి నగవులు నవ్వుకుంటూ తిన్నగా తన గదిలోకి పోయాడు. డ్రస్సు తీసివేసి అటుఇటు చూచాడు. చెవులు రిక్కించి విన్నాడు. కాని అంతా నిశ్శబ్దం. ఏమి చెప్మా! పార్వతి ఇంట్లోలేదా ఏమిటి? తన స్నేహితురాలిని చూడ్డానికి వెళ్ళిందేమో అని అనుకుంటూ పార్వతి గదివైపు వెళ్ళాడు. ఆమె గదితలుపులు లోపల గొళ్ళెం పెట్టి వుండడంచూచి నిర్ఘాంత పోయాడు. పెదవి కొఱుక్కుంటూ స్నానాగారంలో ప్రవేశించాడు. స్నానంచేసి భోజనానికివచ్చి కూర్చున్నాడు. వంట బ్రాహ్మణుడు శివరావుకి మాత్రమే వడ్డించాడు. నిత్యం తనతోపాటు భోజనానికివచ్చే పార్వతి యీవేళ రాకపోయేసరికి ఆయన మనస్సు చివుక్కుమంది. నాయీచిన్న తప్పిదానికి యింత కఠినశిక్షా! అని అనుకున్నాడు. కాని యింకా పార్వతి వస్తుందేమో అనే ఆశ శివరావుని వదలలేదు. ఎంత సేపటికి రాకపోయేసరికి విసుగెత్తి ఏదో రెండు మెతుకులుతిని లేచిపోయాడు. రోజూ ఎంతో ఉల్లాసంగా గడిచే యీ భోజనాల సమయం నేడు నీరసంతో గడిచిపోయింది.

భోజనం అయిం తరువాత శివరావు మేడమీదకు వెళ్ళాడు. ఆయనకింకా పార్వతి స్వయంగా తమలపాకులు తీసికొని వస్తుందని నమ్మకం ఉంది. అందుచే మాటిమాటికి మెట్లవైపుచూస్తూ కూర్చున్నాడు. చివరకు మెట్లమీదనుంచి శబ్దం వినబడింది. పార్వతి వస్తూవుందని యెంచి ఏమీ యెఱుగనట్లు మంచంమీద పోయి పడుకున్నాడు. కాని పాపం పార్వతి కాదు; ఆవచ్చింది వంటవాడు, శివరావు నిర్ఘాంతపోయి వానివంక చూచాడు. అతను ఆకులపళ్లెం అక్కడ పెట్టి వెళ్లిపోయాడు.

నేనేదో తమాషాగా అన్నమాటకేనా పార్వతి కింతకోపం వచ్చింది! వేళాకోళంగా అన్నానేకాని ఆమెను అవమానపరచాలని అనలేదే. ఇంతమాత్రానికి ఇంత పట్టుదలా! భార్యాభర్తలు సరససల్లాపా లాడుకోరూ?....పార్వతి యెంతో సహనశీల, గుణవతి. నన్ను మనసార ప్రేమించిన పవిత్రమూర్తి. అట్టి

ఆమె నేనన్న యీ చిన్నమాటకే యింత కోపగించిందంటే చాల ఆశ్చర్యంగావుంది.........నే నసదర్భంగా మాట్లాడాననుకుంటా. లేకపోతే ఎప్పుడూ లేని ఈ వింతచర్యలు నేడెందుకు తటస్థించుతాయి. నేను రావటం ఒకనిమిషం ఆలస్యం అయితే తహతహలాడే పార్వతి నేడుఇట్లా యెందుకు చేస్తుంది? ఆమె కోమలహృదయాన్ని నొప్పించానుకాబోలు. నేను నిజంగా చాలా పొరబాటు చేసాను.........కాని భర్తనైననాకు ఇంతమాత్రం స్వతంత్రంలేదు; నీమూతిని ఎంగిలి ఉందని చెప్పటానికి. నేనామాట అన్నప్పుడు ఉండేమో అని అనకుండా 'టవల్' తీసుకొని తుడుచుకోటం ఎందుకు. తుడుచుకుందిపో. తుడుచుకున్నప్పుడు దానికి అంటుకున్న మెతుకులు చూచికూడా లేవని అబద్ధం ఆడటం ఎందుకు? నాదగ్గఱ సిగ్గుపడటం ఎందుకు! అబద్ధం ఆడటం ఎందుకు!! నే నామె ప్రియ భర్తనుకాను? నేనామె ప్రేమించుట లేదు!! మా ఇద్దరిలో యీ బేధమెందు కుండాలి? ఒకరితప్పు లొకరు దిద్దుకోవడం దాంపత్య ధర్మం కాదూ! ఈ స్వల్పభాగ్యానికి ఇంత పంతమా? ఈ ఆలోచనలతోనే రాత్రి అంతా ఏకాకియై గడపాడు శివరావు.

ఉదయం ఏడు ఘంటలయింది. రాత్రంతా నిద్రలేని కారణంచే కళ్లు నులుముకుంటూ బద్ధకంతో బెడ్ కాఫీకి తయారయ్యాడు శివరావు. టేబిల్ మీద కాఫీ అయితే ఉంది; కాని ప్రక్కన పార్వతిమాత్రం లేదు. ఇంకానన్ను క్షమించలేదు; అని అనుకుంటూ రెండు గ్రుక్కలు కాఫీత్రాగి కాలకృత్యాలు తీర్చికోటానికి వెళ్లిపోయాడు. ఆ పనులనుండి నివృత్తుడవటంతోటే ఉడుపులు ధరించుకొని కారెక్కి ఆఫీసుకు వెళ్లిపోయాడు.

* * * * *

టయంకాందే భోజనం చేయకుండానే శివరావు వెళ్లిపోవటం చూచి పార్వతి నిర్ఘాంతపోయింది. తన్ను తాను దూషించుకోవటం మొదలుపెట్టింది. దీనికంతా కారకురాలు తానేయని పదేపదే అనుకోవటం మొదలుపెట్టింది. నేనెంత కఠినురాలను, నిర్దయను! దినమంతా వాగివాగి కశుబడలి ఇంటికి వచ్చేసరికి మిథ్యాభిమానంతో వారికెంత కష్టం కలుగచేశాను. రాత్రిభోజనం సరిగా చేయలేదు. ఉదయం ఆభోజనం కూడా లేకుండానే వెళ్లిపోయారే! అయ్యో! అయ్యో! ఎంతపని చేశాను; నేనెంత మూర్ఖురాలను. వారి అర్ధాంగినైనేను చేయవలసినపని ఇదేనా? వారేదో వేళాకోళంగా అన్నమాటకు నాకింత కోపము, పట్టుదల ఎందుకు? నామూలాగ్ని అన్నపానాలు మానివేశారుగదా!

* * * * *

శివరావు మామూలుకంటె రెండుఘంటలు ముందుగానే వచ్చాడు ఇంటికి. ఆకస్మికంగా ఈ రావటాన్ని చూచి పార్వతి కంపించిపోయింది. ప్రేమతప్తయా హృదం ఎప్పుడూ ఏదో ఒకటి శంకించుతూ ఉలిక్కిపడుతూ వుంటుంది.

శివరావు ఉడుపులనైనా తీయకుండ తిన్నగా మేడమీదకుపోయి మంచంమీద పడుకున్నాడు. క్షుధాపీడితుడగుటచే సొమ్మసిల్లి కండ్లుమూశాడు.

పార్వతి ఇక నిలువజాలక పోయింది. అడుగు పెట్టుకుంటూ చప్పుడుకాకుండా మెట్లెక్కింది. గది వైపు చూచింది. శివరావు కనుపించలేదు. గబగబ కొట్టుకుంటూవున్న హృదయాన్ని చిక్కబట్టుకుని ముందుకుసాగింది. శివరావు కండ్లు మూసికొని పండుకొని వుండటం చూచింది. నెమ్మదిగాపోయి శివరావు కాళ్లదగ్గఱ నిలబడింది. డస్సిపోయిన శివరావు వదనం చూచేసరికి పార్వతి హృదయం పటాపంచలయింది. అశ్రుధారలు అనర్గళంగా ఆప్లావితంచేయ మొదలు పెట్టాయి శివరావు పాదాల్ని. శివరావు ఉలిక్కిపడి లేచాడు. ఎదుట పార్వతి వెక్కివెక్కి ఏడుస్తూ నిలబడివుంది. గభాలున క్రిందకుదూకి ఆమెను తన కౌగిట్లోకి తీసికొన్నాడు.